క్లుప్తంగా

27 నుంచి విజయవాడకు నూతన సర్వీసు

ఉదయగిరి: ఉదయగిరి డిపో పరిధిలోని ప్రయాణీకుల సౌకర్యార్థంగా ఈ నెల 27 నుంచి విజయవాడకు నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7.30 గంటలకు ఉదయగిరిలో బయలుదేరి సీతారామపురం, దర్శిగుంటపేట, మొగళ్లూరు, కనిగిరి మీదుగా విజయవాడ కు చేరుకుంటుందని చెప్పారు. తిరిగి రాత్రి 8.30 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఉదయగిరి డిపోకు చేరుకుంటుందని తెలిపారు. ఉదయగిరి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఈఓ తనిఖీలు

ఉదయగిరి: మండలంలో మాదిరి ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు తెలిపారు. ఉదయగిరిలోని ఉర్దూ, బీసీ కాలనీలోని తెలుగు, ఉర్దూ, వెంకట్రావుపల్లిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టీలు, రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యను పరిశీలించారు.

సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. డీడీఓ కార్తీక్ మాట్లాడుతూ వైద్యశాలలో ఆధునిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ 250 నుంచి 300 మంది వరకు రోగులు వస్తున్నారని, వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నామని వివరించారు. కమిటీ సభ్యులు కే .శ్రీనివాసరెడ్డి, డీ శివకుమార్, జీ సంపూర్ణమ్మ, ఎం.శ్రీనివాసులు, ఎస్ జయలక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

మర్రిపాడు: నందవరంలోని హజరత్ నజీర్ ఆలెం షహీద్ దర్గాలో గంధమహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. దర్గా కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీర్లగుడిపాడు సర్పంచ్ మృతి

సంగం: వీర్లగుడిపాడు సర్పంచ్ చెంచురత్నంనాయుడు గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. ఆయన ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు షుగర్ పరీక్షలు చేయించుకునేందుకు వచ్చారు. అక్కడ ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకులిపోయారు. కాగా సర్పంచ్ మృతితో వీర్లగుడిపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి. సర్పంచ్ మృతిపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

అపస్మా ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

ఆత్మకూరు: ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు వంద మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సీఐ గంగాధర్ చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. వికాస్ పాఠశాల విద్యార్థి పీ మహిధర్ ప్రథమ బహుమతి రూ.3వేలు, ప్రగతి పాఠశాల విద్యార్థి కే ప్రవీణ్ ద్వితీయ బహుమతి రూ.2వేలు, శాంతినికేతన్ పాఠశాల విద్యార్థిని బీ లహరి తృతీయ బహుమతి రూ.1000 నగదును దక్కించుకున్నారు. ఎంఎంటీఎస్ఈ కన్వీనర్ రమణారెడ్డి, రాష్ట్ర సహకార్యదర్శి భాస్కర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోటేశ్వరరెడ్డి, మల్లికార్జున నాయుడు, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో చోరీకి యత్నం

అనుమసముద్రంపేట : స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చోరీ యత్నం జరిగింది. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గేటు తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. అయితే వస్తువులు ఏమి చోరీకి గురికాలేదు. దీంతో ఆకతాయిల పనిగా ఉపాధ్యాయులు అనుమానిస్తున్నారు.

పొదుపు మహిళలకు శిక్షణ

కొండాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వెలుగు ఏపీఎం కాంతారావు ఆధ్వర్యంలో పొదుపు మహిళలకు ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీఓ ఆదినారాయణ మాట్లాడుతూ డిజిటల్ పేమెంట్ యాప్‌పై అవగాహన కల్పించారు.

పశుఆరోగ్య శిబిరం

ఆత్మకూరురూరల్: అప్పారావుపాళెంలో పశుఆరోగ్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆత్మకూరు పశుసంవర్థక శాఖ ఏడీఏ డాక్టర్ జయచంద్ర ఆధ్వర్యంలో 279 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

- తీరానికి సహజ రక్షణ కల్పించే మడ అడవులు
- కావలి తీరంలో కనుమరుగు
- వాటి సంరక్షణపై నిర్లక్ష్యం
- కోతకు గురవుతున్న తీరప్రాంతం
- దెబ్బతింటున్న జీవవైవిధ్యం

కావలి తీరంలో కనిపించని మడ అడవులు



మడ అడవులు.. సంరక్షిస్తే మేలు

కావలి : పర్యావరణ పరిరక్షణకు ప్రకృతి ప్రసాదించిన వరం మడ అడవులు. తీరప్రాంతానికి సహజ రక్షణ గోడలు. సముద్రతీర జీవవైవిధ్యంలో వాటిది కీలక పాత్ర. అలాంటి మడ అడవులు కావలి నియోజకవర్గంలో క్రమంగా కనుమరుగవుతున్నాయి. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

ఆక్వాసాగు ప్రారంభంతో..

కావలి నియోజకవర్గ పరిధిలోని కావలి, బోగోలు, అల్లూరు మండలాల్లో 60 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. గతంలో తీరప్రాంతంలో మడ అడవులు బాగా దట్టంగా కనిపించేవి. సహజ సిద్ధంగా పెరిగే ఇవి తీరప్రాంతానికి ప్రకృతి ప్రసాదించిన సహజ రక్షణ గోడగా నిలిచేవి. తుపాన్ల సమయంలో గాలుల వేగాన్ని అడుకుని తీర గ్రామాలను కాపాడేవి. తీరప్రాంతంలో గాలి, నీటి కాలుష్యాన్ని నివారించడంలోనూ కీలకపాత్ర పోషించేవి. మరోవైపు మడ అడవులు జీవవైవిధ్యానికి నిలయంగా ఉండేవి. విభిన్న వృక్షాలతో వలస పక్షులతో పాటు సముద్రపు జీవుల సంతానోత్పత్తికి ఆవాసాలుగా ఉండేవి. అలాంటి మడ అడవులు 1996 నుంచి ఆక్వా సాగు ప్రారంభంతో క్రమంగా కనమరుగయ్యాయి. తీరంలోని మడ అడవులను నరికి రొయ్యల చెరువులుగా మార్చడంతో క్రమంగా నేల పూర్తిగా కాలుష్యమైపోయింది. ఫలితంగా చిత్తడి నేలలు, ఇసుక భూముల్లో మడ అడవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

పెంపకంపై తీవ్ర నిర్లక్ష్యం

మడ అడవులు తీర ప్రాంతానికి సహజ రక్షక కవచాలుగా ఉంటాయి. తీరంలో పర్యావరణం, జీవవైవిధ్య పరిరక్షణకు కీలకమైన మడ అడవుల విస్తీర్ణాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలో తీరంలో మొక్కలను నాటి సంరక్షిస్తే మడ అడవులుగా మారుతాయి. అవి వలస, స్థానిక పక్షులకు ఆవాసాలుగా ఉపయోగపడతాయి. కానీ కావలి నియోజకవర్గంలోని తీరంలో మడ అడవుల పెంపకంపై అధికారులు దృష్టి సారించిన పాపాన పోలేదు.

దెబ్బతింటున్న జీవవైవిధ్యం

కావలి తీరంలో మడ అడవులు కనుమరుగవడంతో జీవవైవిధ్యం దెబ్బతింటోంది. ఇటీవల కావలి, బోగోలు మండలాల్లోని తీరంలో వందలాది ఆలివ్ రిడ్లే తాబేళ్ల మత్యువాత పడ్డాయి. తమిళ జాలర్లు సముద్రంలో చేపలు వేటకు పెద్ద వలలను వినియోగిస్తున్నారు. అవి తగిలి గాయాలపాలై నీటిలో ఈదే శక్తి సన్నగిల్లడంతో ఒడ్డుకు చేరాయి. ప్రాణాలతో ఒడ్డుకు వచ్చిన తాబేళ్లు తిరిగి సముద్రంలోకి పోలేక మరణించాయి. అదే తీరంలో మడ అడవులు ఉండి ఉంటే ఉభయచర జీవులైన తాబేళ్లు వాటిలో తలదాచుకునేవి. మళ్లీ శరీరంలో శక్తిని కూడగట్టుకుని సముద్రంలోకి చేరేవి. సముద్రంలోని వ్యర్థ పదార్థాలు, ఇతర మొక్కలను తింటూ జలాలు కలుషితం కాకుండా చేయడంతో సముద్ర తాబేళ్లు ఎంతో దోహదపడతాయి. మడఅడవులు కనుమరుగవడంతో ఉభయచరజీవుల వంటి తాబేళ్లతో పాటు పక్షి జాతుల ఉనికికి ముప్పు ఏర్పడింది.

మడ అడవులు లేకపోవడం దురదృష్టం

కావలి తీరప్రాంతంలో మడ అడవులు లేకపోవడం దురదృష్టకరం. మడ అడవులపై మత్స్యకారులు, పర్యావరణవేత్తలు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు చైతన్యం కలిగి ఉండాలి. మడ అడవుల పెంపకానికి కృషి చేయాలి.

– కేరామిరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కావలి.

ఎన్‌జీటీ ఆందోళన

గతేడాది నవంబర్ 22న మడ అడవులు ధ్వంసమవుతున్న తీరుపై స్పందించాలని అటవీ పరిశోధనతో పాటు మరికొన్ని సంస్థలకు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నోటీసులు ఇచ్చింది. మడ అడవుల క్షీణతతో తీరప్రాంత రక్షణతో పాటు జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. మడ అడవులు తీర ప్రాంతం కోతకు గురికాకుండా అడ్డుకోవడంతో పాటు పక్షులకు అవాసంగా ఉంటాయి. గత కొన్నేళ్లుగా మడ అడవులు భారీ క్షీణతకు గురవుతున్నాని స్పష్టం చేసింది.



కావలి తీరంలో మడ అడవుల స్థానంలో వెలిసిన ఆక్వా గుంతలు



కావలి తీరంలో తాబేళ్ల కళేబరాలు

మేము వచ్చిందే సమయం



ఉదయం11 గంటలకు ఉపాధి కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఉదయగిరి: మండల ఉపాధి హామీ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది సమయ పాలనను పాటించడం లేదు. మేము వచ్చిందే సమయం, చేసిందే పని అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. దీంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా శుక్రవారం ఉదయం 11.20 గంటల వరకు కార్యాలయానికి ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. దీంతో గ్రామాల నుంచి వచ్చిన ఉపాధి కూలీలు, క్షేత్రసహాయకులు పడిగాయాలు కాయాల్సి వచ్చింది. ఉపాధి సిబ్బంది తీరుపై పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా మార్పులేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని వారు కోరుతున్నారు.

కూలిన విద్యుత్ స్తంభం



ఉదయగిరి: పట్టణంలోని చాకలివీధిలోని ఓ ఇంటి ప్రహరీపై దెబ్బతిన్న విద్యుత్ స్తంభం శుక్రవారం కూలింది. ఆ సమయంలో ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు గమనించి లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



ఉదయగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



సంగంలో ఆటో డ్రైవర్లకు అవగాహన



సోమశిల: అనంతసాగరంలో...

సంగం: రోడ్డు భద్రత నియమాలను ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా పాటించాలని సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించరాదని సూచించారు. రోడ్డును క్రాస్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం సేవించి, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలిస్తే ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలను అందజేస్తుందని తెలిపారు. ప్రాణం ఎంతో విలువైందని, ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారులు స్పందించాలని సూచించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

ఉదయగిరి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ ఎస్ వెంకట్రావ్ సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలో పోలీసులు హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహనాలపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్సైలు కర్నాటి ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలిగిరి: కలిగిరిలో ఎస్సై ఉమాశంకర్ ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లెలోని యూనియన్ బ్యాంక్ సెంటర్ నుంచి తోటలచెరువుపల్లె సెంటర్ వరకు పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉదయగిరి సీఐ ఎస్ వెంకట్రావ్, ఎస్సై రఘునాథ్ పోలీసు సిబ్బంది, గ్రామస్తులతో కలిసి హెల్మెట్లు ధరించి బైక్‌లపై ర్యాలీ నిర్వహించి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని పోలీసు స్టేషన్ నుంచి బంగ్లాసెంటర్ వరకు పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సై వీరప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్‌లపై ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బంది సుభాన్, రాజశేఖర్, విల్సన్, హుస్సేన్, మాధవరావు, రోశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీనివాస పాఠశాలలో ఆత్మకూరు సీఐ గంగాధర్, మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాములు ఆధ్వర్యంలో ఆర్టీసీ, పాఠశాలల బస్సుల డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఎంవీఐ, సీఐలను డ్రైవర్లు శాలువాలతో సత్కరించారు. ఆర్టీసీ డీఎం షేక్ కరీమున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరంలోని పోలీసు స్టేషన్ నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు.



వింజమూరులో..



ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న సీఐ



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లెలో పోలీసుల ర్యాలీ

కావలిలో పోలీసుల కార్డన్ సెర్చ్

- ధ్రువీకరణ పత్రాలు లేని 35 బైక్‌లు, ఆటో స్వాధీనం

కావలి: పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్లాంపేటలో శుక్రవారం వేకువజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని 35 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులతో పెండింగ్ చలాన్లను సైతం కట్టించారు. ఈ సందర్భంగా కావలి డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ కావలి సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగా కావలి డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో ఇస్లాంపేటలో కార్డన్‌సెర్చ్ చేపట్టామని వివరించారు. ప్రతి ఇంటిని తనిఖీ చేపట్టామని తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి, అతి వేగంగా, అజాగ్రత్తగా వాహనాలను నడపొద్దని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. మైనర్లకు వాహనాలను ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎవరైనా వేధిస్తుంటే మహిళలు నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు


కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలి

సంగం: కుష్టు సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా ఎయిడ్స్ మరియు కుష్టు నివారణాధికారి, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. సంగంలోని తిరుమనతిప్ప, ఎస్టీకాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించి కుష్టు సర్వేను తనిఖీ చేశారు. పాత కుష్టు కేసులను సైతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలను గుర్తిస్తే వెంటనే పీహెచ్‌సీకి పంపాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి ప్రాథమిక పరీక్షలు చేసి వ్యాధిని నిర్ధారణ చేస్తారని తెలిపారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందడం ద్వారా అంగవైకల్యం నుంచి రక్షణ పొందవచ్చునని చెప్పారు. 2027 నాటికి కుష్టు వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.




కుష్టు సర్వేను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ


బాలికల సంరక్షణ అందరి బాధ్యత



కావలిలో అవగాహన కల్పిస్తున్న ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ శారద



ఉదయగిరి: వింజమూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కావలి: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్ సీ శారద అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కలుగోలమ్మపేటలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కావలి ఉమెన్ ఫోర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. బాల్యవివాహాలు చేయకుండా బాలికలను చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. ఉమెన్‌ఫోర్స్ నాయకులు ఫాతిమా , నూర్జహాన్, పర్వీన్, టీ సుజాత, సుమయ్య , హబీబా, బుష్రా పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక ఆర్డీఆర్‌కాలనీలోని గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత శుభ్రత, పౌష్టికాహారం ఆవశ్యకత, స్వీయ రక్షణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం ప్రమీల, అంగన్‌వాడీలు రమణమ్మ, రాధ, త్రివేణి, లలిత, మానస తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలు దేశానికే గర్వకారణం

ఆత్మకూరు: ఆడపిల్లలు దేశానికి గర్వకారణమని, నేడు ఆడపిల్లలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారని ఏడీఎంహెచ్‌ఓ ఎస్‌కే ఖాదర్‌వలీ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గురుకులం ప్రిన్సిపల్ కామేశ్వరి, అర్బన్ పీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌కే అస్మా, జిల్లా టీబీ కంట్రోల్ కోఆర్డినేటర్ శ్రావణ్ పాల్గొన్నారు. అలాగే ఎల్ఆర్‌పల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ సుప్రజ, ఎస్‌కే షకీల ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం వాణి, కే సుభాష్, ఆయాలు వెంగమ్మ పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద ఆధ్వర్యంలో బాలికా సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీలు సీహెచ్ పెంచల నరసమ్మ, ఎం అనిత, ఎన్ లక్ష్మీదేవి, మహిళా పోలీస్ విజయలక్ష్మి, హెచ్‌ఎం డానియేల్, ఆశావర్కర్ కె వెంకటరత్నమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ సృజన తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల: మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో మానవహారం నిర్మించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, పోలీసు హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు శ్రీనివాసులు, ఎస్‌కే జమీలా, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మర్రిపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నిర్వహించిన జాతీయ బాలికా దినోత్సవంలో మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. బాలికలకు వారి హక్కులపై అవగాహన కల్పించారు. బాలికలపై జరిగే అఘాయిత్యాలను ఎలా ఎదుర్కోవాలో వివరించి ధైర్యంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఏఎస్‌పేట పీహెచ్‌సీ డాక్టర్ మంజులమ్మ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిప్పించారు. ప్రిన్సిపల్‌తో పాటు హెల్త్ సూపర్‌వైజర్ రషీద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం శాంతికుమారి, ఆశాకార్యకర్త షర్మిల పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజకుమారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాలిలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలికల సంరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సురేఖ, దీప, శ్రీవాణి, రజని,తదితరులు పాల్గొన్నారు.



సోమశిల: పాతదేవరాయపల్లిలో..



చేజర్ల: మాముడూరు హైస్కూల్‌లో..



మర్రిపాడు కేజీబీవీలో..



అల్లూరులో..

పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలి

సోమశిల: అనంతసాగరంలోని టీజీఎస్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన భోజన, వంటశాలలను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీఈఓ జానకిరాం, ఎంఈఓలు కాటంరెడ్డి ప్రభాకర్, సునీత ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. హెచ్‌ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ భోజన శాల నిర్మాణానికి కోలా ఓబయ్య, కోలా పెంచలయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యులు రూ.2 లక్షలు, 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.9.70 లక్షలు అందజేశారని తెలిపారు. వంటశాల నిర్మాణానికి బట్రెడ్డి రమణారెడ్డి జ్ఞాపకార్థంగా కుమారులు బట్రెడ్డి వెంకటకృష్ణారెడ్డి రూ.2లక్షలు అందజేశారని చెప్పారు. 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థి మద్దినేని చెంచయ్యనాయుడు పర్యవేక్షణలో భోజన, వంటశాలల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేసినట్లు తెలిపార. అనంతరం భోజనశాలను 1984-85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, కోలా కుటుంబసభ్యులు, వంటశాలను బట్రెడ్డి సోమశేఖర్‌రెడ్డి, బట్రెడ్డి మహేంద్రరెడ్డి ప్రారంభించారు. ఉపాధ్యాయులు పాలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కేతా సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థులు కోలా ఉమామహేశ్వరరావు, చంద్రమోహన్, శ్రీదేవి, సరోజిని, వాణి, జ్యోతిలక్ష్మి, అజంతా తదితరులు, దాత తుమ్మల జంగం నాయుడు కోడలు సరోజనమ్మ పాల్గొన్నారు.

